కాసులిస్తేనే 'మీసేవ'

దోచుకుంటున్న నిర్వాహకులు

- పేరు ఒకరిది నడిపించేది మరొకరు
- నామమాత్రపు తనిఖీలు చేస్తున్న అధికారులు



సంగారెడ్డి రూరల్‌: అప్పట్లో కుల, నివాస ఇతర ధ్రువీకరణ పత్రాలు కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరిగేవారు. దీంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశం ప్రభుత్వం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 2011 లో పౌరులకు సేవలను అందించడానికి 'మీసేవ' కార్యాలయాలను ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత, దీని సేవలు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి సంబంధించిన సేవలు విభజించారు. ప్రస్తుతం మీసేవలో 150 పైగా సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒక పౌరునికి సంబంధించి పుట్టిన దగ్గర నుంచి మరణించేవరకు జనన, కుల , ఆదాయం, మరణ ఇలా ఎన్నో డిజిటల్‌గా ధ్రువీకరణ పత్రాలన్నీ మీసేవలోనే లభిస్తాయి. ఇంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం కొందరి నిర్వాహకుల స్వార్థంతో నీరుగారిపోతోంది. మీసేవ నిర్వాహకులు మండల, మున్సిపల్‌ అధికారులతో కుమ్మక్కై లేని పత్రాలు సృష్టిస్తున్నారు.

కనీస రుసుం రూ.45 నుంచి రూ.150 వరకే..

సాధారణంగా ఒక పౌరుడు తనకు సంబంధించిన ధ్రువీకరణ అప్లికేషన్‌ కోసం ప్రభుత్వం నిర్దేశించిన రుసుం 50 నుంచి 150 వరకు చెల్లించి సంబంధిత డాకుమెంట్స్‌ని మీసేవ నిర్వాహకులకు అప్పగించాలి. కానీ మీసేవ నిర్వాహకులు మాత్రం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ సంబంధిత పత్రాలు లేవంటూ మీరు ఈ సర్టిఫికెట్‌ పొందాలంటే లీగల్‌గా వెళ్తే 6 నెలల నుంచి ఒక సంవత్సరం వరకు అవుతుంది.. అదే నీవు ఒక 5000 ఇచ్చావంటే ఒక వరం రోజులోనే చేసి ఇస్తామంటూ ప్రజలను అడ్డదారిలోకి నెట్టేస్తున్నారు. అంత డబ్బులు ఎందుకు అని అడిగితే మేము కూడా పైన అధికారులకు ఇవ్వాలని అని చెప్తున్నారు.

అధికారులతో కుమ్మక్కు

సాధారణంగా మీసేవలో అప్లై చేసిన దరఖాస్తులు పరిశీలనకు మండల, మున్సిపల్‌ కార్యాలయానికి వెళ్తాయి. అక్కడ తహసీల్దార్‌, మున్సిపల్‌ కమిషనర్‌, దరఖాస్తులను క్షేత్రస్థాయి సిబ్బందితో పరిశీలించిన తరువాతే ఏదైనా ధ్రువీకరణ పత్రం తమ డిజిటల్‌ సంతకంతో చేయాలి. కానీ ఇక్కడ తహసీల్దార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ తమ రోజు వారి పనిలో బిజీగా ఉండటంతో వారు జారీ చేసే డిజిటల్‌ సంతకం కీ ని సిబ్బందికి అప్పగించడంతో వారు మీసేవ నిర్వాహకులతో కుమ్మక్కై అందినకాడికి దోచుకుంటున్నారు.

చేతిలో పైసా పెట్టు ...

మీసేవ నిర్వాహకులు తమ సర్వీసులు నడిపించడానికి ముందుగా కలెక్టర్‌ కార్యాలయం నుంచి పర్మిషన్‌ తీసుకోవాలి. ఎక్కడితే మీసేవ నిర్వహణ మంజూరు అవుతుందో అక్కడే తమ సర్వీసులు కొనసాగించాలి. కానీ నిర్వాహకులు మాత్రం తమ ఇష్టం వచ్చిన దగ్గర సేవలు ఏర్పాటు చేస్తున్నారు. ఎపుడైనా అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు వారి చేతిలో డబ్బులు పెట్టడంతో అధికారులు చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు.

పేరు ఒకరిది... నడిపించేది మరొకరు

ఎవరతే మీసేవ నిర్వహణకు దరఖాస్తు పెట్టుకుంటారో వారే సేవలందించాలి. కానీ 70 శాతం పైగా నిర్వాహకులు తమ సేవలను ఇతరులకు అమ్మేస్తున్నారు. నిర్వాహకులు సేవలను అందించడానికి దరఖాస్తు చేసుకున్నప్పుడు సంబంధిత అధికారులు 2 ఆపరేటర్‌ లాగిన్లను ఇస్తారు. ఈ సేవలకు జీపీఎస్‌, బయోమెట్రిక్‌ టాగింగ్‌ లేకపోవడంతో ఒక నిర్వాహకుడు రాష్ట్రంలో ఎక్కడనైన తన సేవలను వినియోగించవచ్చు. ఇదే అదునుగా కొందరు నిర్వాహకులు తమ 2 సేవల్లో ఒకటి ఒక దగ్గర మరొకటి ఎక్కడో వినియోగిస్తున్నారు.

రూ. 3 వేలు తీసుకున్నారు.

మా కొడుకు 9 వ తరగతి చదువుతున్నాడు. ఆధార్‌ కార్డులో పేరు తప్పుగా ఉండటంతో సరిచేయమని ఆధార్‌ కేంద్రంలో అడిగితే పుట్టిన ధ్రువపత్రం తీసుకొని రమన్నారు. సంగారెడ్డిలోని ఓమీసేవ కేంద్రానికి వెళ్తే ఆస్పత్రిలో పుట్టిన సంబంధిత ధ్రువపత్రాలు అడిగారు. కానీ, 15 ఏళ్ల క్రితం మా బాబు ఇంటి వద్దనే జన్మించాడు.. ఎలాంటి ధ్రువపత్రాలు లేవు అని చెప్పడంతో, వారు ఇలాంటివి అయితే దరఖాస్తు చేసుకుంటే 6 నుంచి 8 నెలల సమయం పడుతుందని, నీకు తొందరగా కావాలంటే 3000 వరకు ఖర్చు అవుతుందని వారం రోజుల్లో నీకు ధ్రువపత్రం ఇస్తామన్నారు. నాకు అత్యవసరం ఉండటంతో 3000 చెల్లించి తీసుకున్నా.

– సామల సంగారెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్‌పై మాట మార్చిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నామ కిరణ్‌ తదితరులు

జహీరాబాద్‌ టౌన్‌ : ఎల్‌ఆర్‌ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం మాట మార్చిందని బీఆర్‌ఎస్‌ నాయకులు మాజీ కౌన్సిలర్‌ నామ రవికిరణ్‌ ఆరోపించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే ఫ్రీ ఎల్‌ఆర్‌ఎస్‌ అని ప్రకటించి ఇప్పుడు ఫీజు కట్టాలని ప్రభుత్వం ఎందుకు చెబుతుందన్నారు. మార్చి 31లోపు కట్టితే 25శాతం రాయితీ ఇస్తామనడం ప్రజలను మోసం చేయడం కాదని ప్రశ్నించారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది అని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్‌ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్‌ యాకూబ్‌, ఎస్సీ సెల్‌ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్‌, పట్టణ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు శివప్ప, నాయకులు అప్పిరాజ్‌ పాల్గొన్నారు.

చెత్తకుప్పగా నీటి తొట్టె

ఝరాసంగం(జహీరాబాద్‌): పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెను చెత్త కుప్పగా మార్చేశారు. ఝరాసంగంలో తహసీల్దార్‌, పేదరిక నిర్మూలన సంస్థ, పంచాయతీరాజ్‌ శాఖ కార్యాలయాల ఎదుట ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు ఆవరణలో నీటి తొట్టెను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరిసరాల్లో ఉండే పశువుల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో కార్యాలయంలోని చెత్తను తెచ్చి నీటి తొట్టెలో వేసి తగలబెడుతున్నారు. నిత్యం వివిధ గ్రామాల నుంచి ఆయా పనులపై వచ్చే ప్రజలు చెత్త కుప్పగా మార్చిన నీటి తొట్టెను చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని నీటి తొట్టెను వినియోగంలోకి తీసుకువచ్చి పశువుల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి తొట్టెలో తగలబడుతున్న చెత్త

ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు



మాట్లాడుతున్న కమిషనర్‌ జగ్జీవన్‌

నారాయణఖేడ్‌: ఎస్‌ఆర్‌ఎస్‌లో భాగంగా ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు ఈనెల 31నలోపు ఫీజు చెల్లించేవారికి 25 శాతం రాయితీ కల్పించినందున సందేహాల నివృత్తికి ఖేడ్‌ మున్సిపల్‌ కార్యాలయంలో రెండు హెల్ప్‌ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్‌ జగ్జీవన్‌ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 2,612 ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తు దారులు ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణ అర్హతను ధ్రువీకరించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. క్రమబద్ధీకరణ చేసుకుంటే భవన నిర్మాణ అనుమతులు సులభంగా పొందడంతో పాటు దరఖాస్తు చేసేటప్పుడు కట్టాల్సిన 33 శాతం జరిమానా చార్జీలు కట్టాల్సిన అవసరం ఉండదన్నారు. బ్యాంకు రుణాలకు వెళితే ప్రాసెసింగ్‌ సులభతరంగా ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన రామాలయం, శివాలయం సరస్వతీదేవీ ఆలయంతో పాటు జంట నాగులు ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు కార్పొరేటర్‌ పుష్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్‌ చంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు సుఖసౌఖ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులను కార్పొరేటర్‌ దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్‌ నాయకులు సంపత్‌ రెడ్డి, శ్రీధర్‌ రెడ్డి, మల్లేశం, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గమ్మ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



మహోత్సవాల్లో నిర్మలారెడ్డి

సంగారెడ్డి క్రైమ్‌: పట్టణంలోని కల్వకుంటలో గత మూడు రోజులుగా జరుగుతున్న దుర్గాదేవి ఆలయంలో విగ్రహ పున: ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు పశుపతి శర్మ నేతృత్వంలో ఘనంగా పూజలు నిర్వహించారు. రాష్ట్ర టీపీసీసీ చైర్మన్‌ నిర్మలారెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రంజాన్‌ తోఫా కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్‌

సదాశివపేట(సంగారెడ్డి): పవిత్రమైన రంజాన్‌ పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని గౌడ ఫంక్షన్‌ హాల్‌లో మాజీ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో 100 మంది ముస్లిం మహిళలకు రంజాన్‌ తోఫా కిట్లు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రుల నర్సింహాగౌడ్‌ దంపతుల జ్ఞాపకార్థం గత నాలుగు సంవత్సరాల నుంచి రంజాన్‌ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 25 కిలోల బియ్యం, 5 కిలోల గోధుమపిండి, 5 కిలోల చక్కెర, 5 కేజీల మంచి నూనె, 2 కిలోల శనగపప్పు, కంది పప్పు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్‌ కృష్ణాగౌడ్‌, వసీమ్‌, మామిడిరాజు, వినోద్‌ పాల్గొన్నారు.

భయం వీడితేనే జయం

జహీరాబాద్‌ టౌన్‌ : భయం లేకుండా పరీక్షలు రాస్తేనే మంచి మార్కులతో పాస్‌ అవుతారని మండల విద్యాధికారి బస్వరాజ్‌ అన్నారు. మాణిక్‌ ప్రభు హైస్కూల్‌లో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వీడ్కోలు అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఉంటుంది.. ఒక అధ్యాయం నుంచి నూతన అధ్యాయం వైపు ప్రయాణం సాగుతుందని తెలిపారు. ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్‌, పాఠశాల అధ్యక్షుడు ఎంపల్లి మల్లికార్జున్‌, కార్యదర్శి సుభాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ ఎం వెంకటయ్య, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ బస్వరాజ్‌

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను ఆదివారం సిర్గాపూర్‌ మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు డి.సంజీవ రావు కలిశారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని కవిత సూచించారు. కార్యక్రమంలో నాయకులు పుండరీకం, అంజగౌడ్‌ పాల్గొన్నారు.



కవితను కలిసిన బీఆర్‌ఎస్‌ నేతలు

రంగులమయంగా నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం145వ నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులు శ్రీకృష్ణ కీర్తనలు ఆలపిస్తూ శోభయాత్ర నిర్వహించారు. చిన్నారులు, మహిళలు శ్రీ కృష్ణ గీతాలకు నృత్యాలు చేస్తూ ఆనంద పారవశ్యంలో మునిగితేలారు. అనంతరం ఏర్పాటు చేసిన సత్సంగసభలో కంది ఇస్కాన్‌ మందిరం, అక్షయ పాత్ర బాధ్యులు విభిషణ్‌ ప్రభు అనుగ్రహ భాషణం చేస్తూ భగవంతుడికి భక్తుడికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. భక్తుడు ఒక అడుగు ముందుకు వేస్తే భగవంతుడు పది అడుగులు భక్తుడి వైపు వేస్తాడని చెప్పారు. చైతన్య మహాప్రభు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 16న వేడుకలు పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకలకు హాజరై భగవంతుడి ఆశీస్సులు పొందాలని సూచించారు.

దైవభక్తితోనే మానసిక ప్రశాంతత

టీజీపీసీ మాజీ చైర్మన్‌ భిక్షపతి



పూజలు చేస్తున్న భిక్షపతి

వట్‌పల్లి(అందోల్‌): దైవభక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ట్రేడ్‌ ప్రమోషన్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ మఠం భిక్షపతి అన్నారు. ఆదివారం మండలంలోని సాయిపేట గ్రామంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాజీ ఎంపీటీసీలు శివాజీరావు, సంగన్న, మాజీ ఉప సర్పంచ్‌ గోపాల్‌, నాయకులు బస్వరాజ్‌, మొగులయ్య, రమేశ్‌ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్‌ జిల్లా ఇన్‌స్పెక్టర్‌, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్‌, విఘ్నేశ్‌ నల్ల పోచమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతోపాటు పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్‌ అసిస్టెంట్‌ వెంకట్‌రెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

కొనసాగుతున్న సికింద్లాపూర్‌ ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండలంలోని సికింద్లాపూర్‌ లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకున్నారు.



చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొండాపూర్‌: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



సదాశివపేటలో: పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

కొండాపూర్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్లెపల్లిలో ఆదివారం 2007–08వ సంవత్సరం పదవ తరగతి బ్యాచ్‌ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 17 సంవత్సరాల తరువాత ఒకే దగ్గర కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విద్యార్థులు ఒకరి కొకరు యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఎవరూ ఎలాంటి ఉద్యోగాలు చేస్తున్నారంటూ అప్పటి ఉపాధ్యాయులు సైతం వారిని పలకరిస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

సదాశిపేట ప్రభుత్వ పాఠశాలలో..

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని ఎంజీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో గురువులు శ్రీశైలం, ప్రభాకర్‌, అశోక్‌, పండరి, రుక్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీంద్రనాథ్‌, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

అందోల్‌ మండలంలో..

వట్‌పల్లి(అందోల్‌): అందోల్‌ మండలంలోని నేరడిగుంట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు మల్లయ్య, ఈశ్వర్‌ ప్రసాద్‌, నాగరాజు, మోహన్‌దాసు, సతీష్‌కుమార్‌, సాయిబాబా, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆటాపాటలతో సందడి చేశారు.



వట్‌పల్లి(అందోల్‌)లో: పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

నేడు పాదయాత్ర ప్రారంభం

నారాయణఖేడ్‌: దత్తగిరి మహారాజ్‌ 46వ వార్షిక అమరతిథిని పురస్కరించుకుని బెల్లాపూర్‌లోని దత్తగిరి ఆశ్రమం నుంచి సోమవారం పాదయాత్ర, పల్లకీసేవ (రథయాత్ర) ప్రారంభమవుతుందని దత్తగిరి మహారాజ్‌ ఉత్సవకమిటీ బాధ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల మీదుగా కొనసాగుతూ ఈ నెల 15న ఝరాసంగం మండలం బర్దీపూర్‌లోని దత్తగిరి ఆశ్రమానికి చేరుకుంటుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాజీ మంత్రికి ఆహ్వానం



హరీశ్‌రావుకు ఆహ్వానపత్రం అందిస్తున్న మహిళలు

పటాన్‌చెరు టౌన్‌: మాజీ మంత్రి హరీశ్‌ రావును ఆదివారం బీఆర్‌ఎస్‌ మహిళా నేతలు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మార్చి 11న కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌ ఆధ్వర్యంలో నిర్వహించబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మెట్టు రమా, భారతినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సింధు, బీఆర్‌ఎస్‌ మహిళా నేతలు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన కార్పొరేటర్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ మంత్రి హరీశ్‌రావును ఆదివారం ఆయన నివాసంలో భారతినగర్‌ కార్పొరేటర్‌ సింధురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నానని తెలిపారు. సీనియర్‌ నాయకులు ఆదర్శ్‌ రెడ్డి ఉన్నారు.

డంపింగ్‌ యార్డు ఏర్పాటును విరమించుకోండి

బీఆర్‌ఎస్‌ నాయకుడు గోవర్ధన్‌ రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలోని ప్యారానగర్‌ గ్రామ వద్ద ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌ యార్డుకు వ్యతిరేక ఆందోళనలు ఆదివారం 33వ రోజుకు చేరాయి. డంపింగ్‌ యార్డు ఏర్పాటును రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నష్టం కలిగించేలా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని అన్నారు. ప్రజారోగ్యం, రైతన్నల నష్టాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. జేఏసీ పిలుపు మేరకు కార్యాచరణ మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సీజీఆర్‌ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సపాన దేవ్‌

పటాన్‌చెరు టౌన్‌: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపానదేవ్‌ అన్నారు. శనివారం డివిజన్‌ పరిధిలోని ముదిరాజ్‌ భవన్‌ లో ముదిరాజ్‌ సంఘం డివిజన్‌ అధ్యక్షుడు ఎట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు..మహిళలు పురుషులతో పాటు సమానంగా రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

ప్రహరీ కూలినా పట్టదా?



నర్సాపూర్‌: పట్టణంలోని విద్యుత్‌ శాఖ బిల్‌ కలెక్షన్‌ సెంటర్‌ ప్రహరీ కొంతభాగం కూలి చాలా కాలం అవుతున్నా ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. బిల్‌ కలెక్షన్‌ సెంటర్‌ భవనంలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ పక్క నుంచి ఉన్న ప్రహరీ కూలడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ వైర్లు ప్రమాదకరంగా మారాయి. ఆ గోడను మళ్లీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మండల ఏఈ రాంమూర్తిని వివరణ కోరగా.. ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.